నూరేళ్ళ తెలుగు కథకు
**నవ్య నీరాజనం - 23**
నూరేళ్ళ తెలుగు కథకు




బొమ్మ: బాపు

# నా చేయి పట్టుకుని నాన్న నడిపిస్తున్నట్టే ఉంది!!

**- సాయిచంద్**

ఇప్పటికీ తెలుగులో గొప్ప నవలల పేర్లు పది చెబితే అందులో 'అసమర్థుని జీవయాత్ర' తప్పకుండా ఉంటుంది. నవలలు, కథలు అసంఖ్యాకంగా రాసి, తెలుగువారి హృదయాలలో చెరగని స్థానం సంపాదించుకున్న గోపీచంద్ 8 సెప్టెంబర్ 1910లో జన్మించారు. రేడియోలో, పత్రికల్లో, సినిమారంగంలో విశేషంగా కృషి చేసిన ఆయన 2 నవంబర్ 1962లో మరణించారు. తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర గోపీచంద్. ఆయన శతజయంతి సందర్భంగా, వారి కుమారుడు సాయిచంద్ తండ్రి జ్ఞాపకాలను మనతో పంచుకుంటున్నారు.



పి.వి.నరసింహారావు తదితరులతో...

### రోజూ కూరగాయలు తెచ్చేవారు

మా నాన్న ప్రముఖ రచయిత గోపీచంద్. అమ్మ శకుంతలాదేవి. మేం ముగ్గురం మగపిల్లలం. ముగ్గురు ఆడపిల్లలు. నేనే ఆఖరువాడిని. అందువల్ల నేనంటే నాన్నగారికి చాలా ముద్దు. అప్పటికే ఆయన ఇన్‌ఫర్మేషన్ డైరెక్టర్ అయినా, రోజూ పొద్దున్నే నాన్నగారే మార్కెట్టుకు నడుచుకుంటూ వెళ్లి కూరగాయలు తీసుకువచ్చేవారు. నేను కూడా ఆయన వెంట వెళ్లేవాడిని. దారి పొడవునా నాన్నగారు మాటలు చెబుతూ ఉండేవారు.

### నాన్న చెప్తుంటే అమ్మ రాసేది

నాన్నగారు సాధారణంగా పొద్దుటిపూటే రాసుకునేవారు. మంచంమీద కూర్చుని ఎడమ మోకాలు పైకి లేపి, దానిపై అట్ట పెట్టుకుని రాసేవారు. సాయంత్రం సమయాల్లో అయితే, ఆయన చెప్తుంటే అమ్మ రాస్తుండేది.

### ఏలి కాపీ ఓలికమ్మా

నాకు బాగా గుర్తున్న ఓ సంగతి చెప్తాను. అప్పుడప్పుడే నాకు మాటలు వస్తున్నాయి. నాన్నగారు ఆఫీసునుంచి వచ్చారు. అమ్మ కాఫీ కలుపుతోంది. నేను అమ్మ దగ్గర నిలబడి "ఏలి కాపీ ఓలికమ్మా"(వేడికాఫీ ఎవరికమ్మా) అని అడిగాను. అది వింటూనే నాన్నగారు పకపకా నవ్వారు. ఆయనకు ఆ మాటలు ఎంతిష్టమో!

### నేను చనిపోతానని చెప్పారు

నాన్నగారు అప్పుడు కర్నూలులో ఆలిండియా రేడియో స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. నేను ప్రిమెచ్యూర్ బేబీగా పుట్టాను. పుట్టినప్పుడు నేను ఏడవనేలేదట! నేను చనిపోతానని డాక్టర్లు చెప్పారు. నాన్న అక్కడ ఉండే సాయిబాబా టెంపుల్‌కు వెళ్లి నన్ను బ్రతికించమని మొక్కుకున్నారు. అందుకని నా పేరు సాయిచంద్ అని పెట్టారు. ఎం.ఎన్.రాయ్ నుంచి మొదలై, అరవింద్ ధ్యాన యోగం, సాయి భక్తియోగం వరకు నాన్న ప్రయాణం చాలా భిన్నంగా సాగింది. అప్పట్లో నాన్న 'యువ'లో సాయి పేరుతో రాసేవారు.

### నాన్నే అక్షరాభ్యాసం చేయించారు

నేను పుట్టినప్పటికి మేం హైదరాబాదులోని నారాయణగూడలో ఉండేవాళ్లం. మాకు దగ్గర్లోని బర్కత్‌పురాలో ఉండే స్కూల్లో నాన్న నన్ను చేర్పించారు. నన్ను ఒడిలో కూర్చోబెట్టుకుని ఆయనే స్వయంగా నా చేత అక్షరాభ్యాసం చేయించారు. స్కూల్లో చేర్పించాక, పక్కనే ఉండే స్టుడియోలో నా ఫొటో తీయించారు.

### చాలా కోపిష్టి

నాన్నగారు చాలా కోపిష్టి. నేను చిన్నప్పటినుంచీ చాలా వీక్‌గా ఉండేవాడిని. అందువలన నన్ను ఏమనేవారు కాదు. మా అన్న రామ్‌గోపాల్ బాగా అల్లరి చేసేవాడు. అప్పుడు నాన్న కఠినంగా దండించేవాడు. అది చూసి మేము భయపడేవాళ్లం. నాన్న అంత ఫిలాసఫీ చదువుకున్నారు, అంతగా ఆలోచిస్తారు, అన్ని పుస్తకాలు రాశారు..యింత కోపమెందుకు? అనే అనుమానం ఉండేది నాకు. దాశరథిగారు నారాయణగూడలో మా ఎదురు సందులో ఉండేవారు. ఆయన, నాన్నగారు రేడియో మిత్రులు. నాన్నగారి కోపం గురించి ఆయన ఓసారి నాతో "మీ నాన్నగారిలో సంఘర్షణ ఎక్కువ. జీవితంలో వైరుధ్యాలూ ఎక్కువ. రేడియోలో పనిచేస్తూ, సినిమాలకు పనిచేస్తూ, యువకు సంపాదకత్వం వహించడం ఎంత కష్టమో ఆలోచించు. 'రాజహంస' పేరుతో తత్వవేత్తలు రాయాలి. చీకటి గదులు నవలను సీరియల్‌గా రాయాలి. 'నేను యింతవాణ్ణి ఎలా అయ్యాను' అనే ఫీచర్‌ను నీ పేరుతో.. అదే 'సాయి' పేరుతో రాయాలి. ఇవన్నీ రాయడంతో ఆయనలోని బెస్ట్‌పార్ట్ అంతా పోయి మిగిలింది కోపంగా యిలా పిల్లలపైకి వస్తుంది" అన్నారు.

### నాన్నగారికి సడెన్‌గా గుర్తొచ్చేది

మమ్మల్ని పట్టించుకోవడం లేదని వారానికో, పదిరోజులకో ఓసారి సడెన్‌గా నాన్నగారికి గుర్తొచ్చేది. వెంటనే మమ్మల్నందరినీ హోటల్‌కు తీసుకెళ్లేవారు. ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్లేవారు. సినిమాలకు కూడా తీసుకెళ్లేవారు. అప్పుడప్పుడు ఇంగ్లీషు సినిమాలు చూపించేవారు. నేను 'శాంమ్సన్ అండ్ డెలైలా' అనే సినిమా అప్పుడు చూసిందే!

### యువ రచయితలను ప్రోత్సహించేవారు

నాన్నగారి కోసం మాయింటికి ఎక్కువగా నార్ల వెంకటేశ్వరరావుగారు, దాశరథిగారు, నారాయణరెడ్డిగారు, చక్రపాణిగారు, విశ్వనాథగారు వచ్చేవారు.. మా నాన్నగారి స్వంతూరు తెనాలి దగ్గర చవటపల్లి. అక్కడినుంచి కూడా మా ఇంటికి ఎక్కువమంది వచ్చేవాళ్లు. మేముండేది చిన్న ఇల్లు. ముందు గదిలో ఒక సోఫా ఉండేది. ఇంట్లో ఎక్కువమంది ఉండటంతో స్థలం సరిపోక ఆ సోఫాలో ఎవరో ఒకరం పడుకునేవాళ్లం. ఇంటికి ముగ్గురు నలుగురు వచ్చారంటే కూర్చోవడానికి స్థలం సరిపోయేది కాదు. సోఫాలో పడుకోనున్న వారిని కాస్త పక్కకు జరిపి, వారూ సోఫాలో చివర కూర్చుని నాన్నగారితో చర్చలు జరిపేవాళ్లు. యింట్లో ఎప్పుడూ ఏదో ఒక చర్చ జరుగుతూ ఉండేది. నాన్న ఎదుటి వారిని బాగా ఎంకరేజ్ చేసేవారు. నాన్న 'యువ'లో ఉన్నప్పుడు రంగనాయకమ్మ, యద్దనపూడి, కోడూరి కౌసల్యాదేవి లాంటి యువ రచయితలని బాగా ప్రోత్సహించే వారని సినీ నటులు గుమ్మడి గారు చెప్పారు. ఆంధ్రప్రభ నిర్వహించిన నవలల పోటీలో 'చక్రభ్రమణం' నవలకు ప్రథమబహుమతి వచ్చింది. దానికి న్యాయనిర్ణేత నాన్నగారే! ఆ నవల సినిమాకు పనికొస్తుందని దుక్కిపాటి మధుసూదనరావుగారికి నాన్నగారే రెకమండ్ చేశారు.



చిత్ర దర్శకునిగా....

### కథలో వ్యాసం, వ్యాసంలో కథ!

ఆయన కు నచ్చిన విషయాలన్నింటినీ ఏదో ఒక సందర్భంలో కథల్లో, నవలల్లో

ఎక్కడో ఒకచోట ఇరికించేసేవారు. అందుకే ఆయన కథలు కొన్ని వ్యాసాల్లా ఉంటాయి. కొన్ని వ్యాసాలు కథల్లా ఉంటాయి.

### మంచి భోజనప్రియుడు

నాన్నగారు మంచి భోజనప్రియుడు. చెగోడీలు చాలా యిష్టంగా తినేవారు. తన 'చీకటి గదులు'లో కూడా వీటి ప్రస్తావన ఉంది. కంద యిగురు, ఆలుగడ్డ యిగురు కూడా చాలా ఇష్టంగా తినేవారు.

### గోపీచంద్‌గారబ్బాయి


ఇప్పటికీ నాన్న నా చేయి పట్టుకుని నన్ను నడిపిస్తున్నట్టే ఉంటుంది. ఆయన పత్రికల్లోనూ, సినిమాల్లోనూ చేసిన కారణంగా పదిమందితో ఎక్కువ పరిచయాలు ఉండటంతో, నాకు వృత్తిపరంగా ఎక్కడయినా ఏ చిన్న ప్రాబ్లెమ్ వచ్చినా సరే, వెంటనే పరిష్కారం దొరుకుతోంది. అందరికీ నాన్నంటే అంతగౌరవం. బాపుగారయితే 'గోపీచంద్ గారబ్బాయి' అనే పిలిచేవారు. నేనూ అలా పిలిపించుకోవడాన్ని చాలా ఎంజాయ్ చేస్తాను.

### నూరుశాతం ఆయన ఇన్‌ఫ్లుయెన్స్ ఉంది..


మా నాన్నగారి సాహిత్య ప్రభావం అన్నయ్య డాక్టర్ రమేష్ మీద ఎక్కువగా ఉండేది. ఆయన చాలా నాటకాలు రాశారు. నామీద థింకర్‌గా ఆయన ప్రభావం ఉంది. ఏం రాసినా సమాజానికో ప్రయోజనం ఉండాలి అని నాన్నగారు ఆలోచించేవారు. అలానే నేనూ ఏం చేసినా సమాజం కోసం ఉపయోగపడేలా ఉండాలని చేస్తున్నాను. నాన్నగారి 'అసమర్థుని జీవయాత్ర' నవల పర్సనల్ డెవలప్‌మెంట్‌లా అనిపిస్తుంది. అవన్నీ నా నిజజీవితంలో చాలా టచింగ్‌గా ఉండేవి. యిప్పటికీ నాకు గైడ్, ఫిలాసఫర్ నాన్నగారే! మనల్ని చెక్ చేసుకోవడానికి సాహిత్యం బాగా ఉపయోగపడుతుంది. నన్ను మినీ గోపీచంద్ అనుకోవచ్చు. ఏ పని చేస్తున్నా నాన్నగారికి చెడ్డపేరు వస్తుందేమో అని ఆలోచిస్తాను. నాపైన నూరుశాతం ఆయన ఇన్‌ఫ్లుయెన్స్ ఉంది.

### చనిపోవడం అంటే తెలీని వయసు నాది

నాన్నగారి గురించి ఎప్పటికీ మరచిపోలేని జ్ఞాపకం, ఆయన మరణమే! అది 8 సెప్టెంబర్, 1962. ఆ రోజు నేనూ, మా చిన్నక్క మా ఇంటికి ఎదురుగా ఉన్న పార్కులో ఆడుకుంటున్నాం. మాయింట్లో పని చేస్తున్న అమ్మాయి వచ్చి 'నాన్నగారు చనిపోయారు' అని చెప్పింది. చనిపోవడం అంటే కూడా ఏమిటో తెలీని వయసు నాది. నేనూ, చిన్నక్క ఇంట్లోకి వెళ్లాం. నాన్న భౌతిక కాయం చుట్టూ జనం చేరి ఏడుస్తున్నారు. నేను ఇంట్లోకి వెళ్లగానే 'అయ్యో.. సాయి వచ్చాడు' అంటూ మరింత బిగ్గరగా ఏడ్చారు. చక్రపాణిగారు నన్ను వాళ్ళబ్బాయి సుధాకర్‌గారింటికి తీసుకుపోయారు. అంతకు ముందు ఒకసారి నాన్నగారు ఢిల్లీ వెళ్లినప్పుడు హార్ట్ ఎటాక్ వచ్చిందట! ఆ సంగతి మాకు తెలీదు. సెప్టెంబర్ 7వ తేదీ ఆదిలాబాద్ రేడియో కేంద్రానికి వెళ్లి 'గ్రామస్తుల కార్యక్రమం' చూశారు. అదే రోజు సాయంత్రం హార్ట్‌ఎటాక్ వచ్చింది. మాకు తెలిసేలోపే నాన్నగారు పోయారు.



భార్య, పిల్లలతో...



భార్య శకుంతలాదేవితో గోపీచంద్

### నాలుగేళ్లకు అమ్మకూడా

నాన్నగారితో అమ్మకు అటాచ్‌మెంట్ ఎక్కువ. ఉన్నవ లక్ష్మీనారాయణగారి స్కూల్లో అమ్మ చదువుకునేది. అక్కడే నాన్నకు అమ్మ పరిచయం అయింది. ఆ పరిచయం పెళ్లి వరకూ వచ్చింది. నాన్న ఏది రాసినా అమ్మతో డిస్కస్ చేసేవారు. నాన్న చెప్తుంటే అమ్మ రాసేది. అలాంటిది నాన్నగారు పోవడంతో ఆ లోటును అమ్మ జీర్ణించుకోలేకపోయింది. అమ్మ ఎప్పుడూ ఆయనను తలచుకుని ఏడుస్తూ ఉండేది. నాన్నగారు పోయిన నాలుగేళ్లకు అమ్మకూడా పోయారు. నాన్న, అమ్మ ఇద్దరూ పోవడంతో విజయవాడలో ఉన్న మా మామయ్య పాతూరి నాగభూషణంగారు నన్ను గోరాగారి పాఠశాలలో చేర్పించారు. అది గాంధేయ పద్ధతిలో నడుస్తున్న పాఠశాల. గోరాగారి ప్రతి పనీ నాన్నగారి కథల్లో తారసపడే పాత్రల్లాగానే ఉండేది. అక్కడ ఉన్న పెద్దలు కూడా తరచూ నాన్నగారి సాహిత్యం గురించి చర్చించేవాళ్లు. నన్ను గోరాగారు అక్కడికి వచ్చేవారందరికీ 'గోపీచంద్ గారబ్బాయి' అని పరిచయం చేసేవారు. నాన్నగారి గొప్పతనం అప్పుడే తెలిసింది. నాన్నగారి సాహిత్యం చదవడం మొదలు పెట్టాను. అలా నేను కూడా నాన్నగారి సాహిత్యం చిన్నవయసులోనే మొత్తం చదివేశాను.

### ఆయన రచనలన్నీ పది సంపుటాలుగా..

నాన్నగారు పోయినప్పుడే ఆవుల సాంబశివరావు, బెజవాడ గోపాలరెడ్డిగారి ఆధ్వర్యంలో నాన్నగారిపేరుతో ఓ కమిటీ ఏర్పడింది. 1963లో స్మారక సంచిక తెచ్చారు. అందులో నాన్నగారిపై అద్భుతమైన వ్యాసాలున్నాయి. అప్పట్నించీ ప్రతి సంవత్సరం 'గోపీచంద్' అవార్డు ఇస్తున్నాం. మొట్టమొదట ఈ అవార్డును రావిశాస్త్రి అందుకున్నారు. రెండేళ్లుగా ఈ అవార్డును జాతీయస్థాయిలో ఇస్తున్నాం. ఈ సెప్టెంబర్ 26, 27 తేదీల్లో డెట్రాయిట్‌లో నాన్నగారి శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. వాటికి నేను వెళుతున్నాను. అలాగే సెప్టెంబర్ 8న రవీంద్రభారతిలో ఆయన శతజయంతి ఉత్సవాలు జరుగుతాయి. ఆ సందర్భంగా మొత్తం ఆయన రచనలన్నింటినీ 10 సంపుటాలుగా తెస్తున్నాం.


**- సుంకోజి దేవేంద్రాచారి**

## నాకు నచ్చిన మా నాన్న కథ

# రెండు జీవాలు నిండు హృదయాలు

- సాయిచంద్

జిజియా, కమలాకరం మద్రాసు నుంచి వచ్చే రైల్లో దిగారు. మద్రాసులో ఒక కాలేజీలో కమలాకరం ప్రొఫెసరు. ఆ కాలేజీలోనే జిజియా ఆనర్సు పరీక్ష చదివింది. కాలేజీ సారస్వత సంఘానికి జిజియా సెక్రటరీ, కమలాకరం ప్రెసిడెంటు. ఈ విధంగా వాళ్ళిద్దరికీ స్నేహం కలిగింది. వాళ్ళిద్దరికీ స్నేహం కలగటానికి మరొక కారణం కూడా వుంది. ఇద్దరూ ఒక తాలూకానుంచే వచ్చారు. ఇద్దరి గ్రామాలూ దగ్గరే. సారస్వత సంఘం పనుల్లో వాళ్ళు తరచు కలుస్తూ వుండేవారు. అనేక విషయాలను గురించి చర్చించుకుంటూ వుండేవారు. వాళ్ళస్నేహం అందరి స్నేహం వంటిది కాదు. అన్ని విషయాల్లోనూ యిద్దరూ ఒకే విధంగా ఆలోచించే వారు.



ఇద్దరికీ సంఘసేవ చెయ్యాలనీ, భారతదేశంలో వున్న దారిద్ర్యం పోగొట్టి ప్రజలను బాగుచెయ్యాలనీ అభిలాష వుండేది.

''చదువు పూర్తి అవగానే సంఘసేవ చేస్తాను'' అనేది జిజియా.

''దేశం అంతా ఇలా అల్లకల్లోలంగా వున్నప్పుడు ఏమీ అంటనట్టు ఉద్యోగం చేసుకుంటూ కూర్చోవటం నాకు ఏమీ బాగా లేదు'' అనేవాడు కమలాకరం.

''మరి ఏం చేస్తారు?''

''ఉద్యోగానికి రాజీనామా పెడదామనుకుంటున్నాను''.

వాళ్ళిద్దరిలో ఒకరు మహమ్మదీయులు. ఒకరు హిందువులు. అయినా వాళ్ళ ఆలోచనలకు మతం ఎప్పుడూ అడ్డు వచ్చేది కాదు. భారతదేశం దాస్యంలో, దారిద్ర్యంలో వుండటం వల్ల మహమ్మదీయులూ కష్టపడుతున్నారు. హిందువులూ కష్టపడుతున్నారు. ప్రత్యేకం మహమ్మదీయులకి సహాయం చెయ్యాలి అనుకోటంగానీ, ప్రత్యేకం హిందువులకే సహాయం చెయ్యాలి అనుకోటం గానీ వీళ్ళకి బొత్తిగా అర్థమయ్యేది కాదు. సహాయం ఎవళ్ళకి అవసరమో వాళ్ళకి చెయ్యాలి. హిందువులలోను, మహమ్మదీయులలోను ధనవంతులున్నారు. ఈ ధనవంతులు వాళ్ళ వాళ్ళ మతాలలో వున్న బీదవాళ్ళని దోచుకుంటూనే వున్నారు. కాబట్టి భారతదేశాన్ని బాగుచెయ్యాలంటే మత దృష్టితో చూడటం వల్ల లాభం లేదు, అన్ని మతాల్లో వున్న బీదవాళ్ళకి సహాయం చెయ్యగలిగినప్పుడే మొత్తం దేశం బాగుపడుతుంది - అనుకుంటూ వుండేవారు.

రైలు స్టేషన్‌లో దిగగానే వాళ్ళ మనస్సులు ఇటువంటి ఉత్తమమైన ఆలోచనలతో తొణికిసలాడుతున్నాయి. వారి వారి గ్రామాలకి వెళ్ళటానికి వారు విడిపోవలసిన సమయం వచ్చింది. స్టేషన్ దగ్గర నుంచి కమలాకరం గ్రామం వెళ్ళాలంటే బస్సు మీద ఇరవై మైళ్ళు వెళ్ళాలి ఉత్తరంగా. జిజియా గ్రామానికి పదిమైళ్ళు వెళ్ళాలి దక్షిణంగా.

ఇప్పుడు వారు కొత్తగా మాట్లాడుకోవలసిన సంగతులేమీ లేవు. ఏమయినాసరే సంఘసేవకి తమ జీవితాలని అర్పించాలనే సంకల్పాన్ని మళ్ళీ వొకసారి పునశ్చరణ చేసుకున్నారు.

''సెలవు'' అన్నది జిజియా.

''మళ్ళీ ఎప్పుడు కనపట్టం?'' అడిగాడు కమలాకరం.

దీనికి వెంటనే జవాబు చెప్పలేక పోయింది జిజియా.

''ఇక మా వూళ్ళోనే ఉంటాను'' అన్నాడు కమలాకరం.

''మరి ఉద్యోగమో!'' అన్నది జిజియా.

''మా వూరి నుంచే రాజీనామా పంపిస్తాను. కష్టమో, నిష్ఠూరమో నేను నిశ్చయించుకున్నాను - ప్రజల సుఖం కోసం నా జీవితం అంకితం చేస్తాను'' అన్నాడు కమలాకరం.

''నేనూ అలాగే అనుకుంటున్నాను. ముందు మా గ్రామ ప్రజలకి నాకు చేతనైన సేవ చెయ్యటానికి ప్రయత్నిస్తాను'' అన్నది జిజియా.

''అయితే తప్పక కలుసుకుంటాం'' అన్నాడు కమలాకరం.

''ఆలోచనలు ఒకటే అయినప్పుడు ఎక్కడ వున్నా కలసి వున్నట్టే'' అన్నది జిజియా.

వాళ్ళ మనస్సులో అనేక భావాలు పరుగెత్తినై. ఎన్నో సంగతులు చెప్పుకోవాలనుకున్నారు. కాని వాళ్ళకి మాటలు రాలేదు. పైకి మాటాడుకోక పోయి

నప్పటికీ తమ హృదయాలు విప్పి చెప్పుకున్నట్టే వుంది వాళ్ళకి. కమలాకరం జిజియాని బండి ఎక్కించి, కనిపిస్తున్నంతసేపూ అలాగే చూస్తూ నుంచున్నాడు.

***

జిజియా, కమలాకరాల హృదయాలు నిండైనవి; స్వచ్ఛమైనవి. కాని అజ్ఞానంలో, దారిద్ర్యంలో కుళ్ళే ప్రజల పరిస్థితి వేరు. ఆ సంగతి వాళ్ళకి గ్రామంలో అడుగు పెట్టగానే తెలిసింది.

కమలాకరం గ్రామంలో హిందువులూ, మహమ్మదీయులూ సగానికి సగంగా వున్నారు. ఇంతకు ముందెప్పుడూ ఆ గ్రామంలో మత కలహాలు లేవు కాని, కొద్ది రోజుల నుంచి గ్రామస్థులలో ఆవేశాలు పెరుగుతూ వచ్చినై. ''కారణం ఇది'' అని ఎవరూ చెప్పలేరు. అసలే ఉద్రేకాలతో ఉండడం వల్ల, ప్రతి చిన్న విషయం భయంకర రూపం దాల్చటం మొదలు పెట్టింది. ఆ రోజు ఒక మహమ్మదీయ బాలుణ్ణి ఒక హిందువు కొట్టటం, దానితో మహమ్మదీయులకి కోపం రగలటం జరిగింది. ద్వేషాలు పెరిగిపోయి విచక్షణా జ్ఞానం నశించింది రెండు పక్షాలకీ.

అటువంటి పరిస్థితుల్లో కమలాకరం తన గ్రామంలో అడుగుపెట్టాడు. సంగతులు తెలుసుకొని హిందువులకూ మహమ్మదీయులకూ సఖ్యత కుదర్చటానికి ప్రయత్నించాడు. కాని, లాభం లేకపోయింది.

''నువ్వు హిందువువి'' అన్నారు మహమ్మదీయులు.

''నీలో హిందూ రక్తం లేదు'' అన్నారు హిందువులు.

కాని, కమలాకరం నిరాశ చెందలేదు. నిష్కల్మష హృదయంతో తన ప్రయత్నం తాను చేస్తూనే వున్నాడు.

ఒకరోజు అతను చీకటిపడి యింటికి వస్తూ వుండగా, ఎవరో అతన్ని పొడిచి చంపేశారు. ఈ వార్త అతని అన్నకి తెలిసింది. అంతవరకు కమలాకరాన్ని చూసి వూరుకుంటూవున్న అతని అన్న, ఆవేశంతో విజృంభించాడు. నిర్దాక్షిణ్యంగా మహమ్మదీయులను హింసించటం మొదలు పెట్టాడు.

''రక్తానికి రక్తం'' అన్నాడు.

''నా తమ్ముడి ఆత్మశాంతికోసం'' అన్నాడు.

ఆ రోజు నుంచీ కమలాకరం అన్నే హిందువులకి నాయకత్వం వహించాడు.



### కథాంతరంగం

నాన్నగారిలో నాకు నచ్చిన అంశం ఏంటంటే డైరెక్ట్‌గా గాని, ఇన్ డైరెక్ట్‌గా గాని సొసైటీగురించి ఆలోచించేవారు. చిన్న గల్పిక రాసినా, సినిమాలకు రాసినా సోషల్ అవేర్‌నెస్ ఉండేది. ఈ లక్షణాలు 'రెండు జీవాలు : నిండు హృదయాలు' కథలో మనకు స్పష్టంగా కనిపిస్తాయి. చాలా టచింగ్‌గా వుంటుంది. మతసామరస్యంపై రాసిన కథ ఇది. అరవై సంవత్సరాల క్రితం రాసినా ఇప్పటికీ ఇందులో సోషల్ అవేర్‌నెస్, టచింగ్ ఉంది. విశ్వనాథ కవి సామ్రాట్ అయినట్టే, మా నాన్నగారు కథాసామ్రాట్.

తన తమ్ముణ్ణి అకారణంగా చంపారనే కసి అతన్ని అనేక దారుణ కృత్యాలకి పురికొల్పింది.

''రక్తానికి రక్తం!''

''నా తమ్ముడి అత్మశాంతికోసం''

ఈ మాటలు అతనికి తారకమంత్రం అయినై.

***

గ్రామం అంతా కంపించిపోయింది. ప్రజలు భయంతో గడగడ వొణికిపోయారు. హిందువులు గాని, మహమ్మదీయులు గాని, బయటికి అడుగు పెట్టటం లేదు. బయటికి వచ్చిన ప్రాణి మళ్ళీ యింటికివెళ్ళే ఆశలేదు. మతోద్రేకం వీరవిహారం చేస్తూ వుంది.

కమలాకరం అన్న పూనకం పూనినవాడికి మల్లే ప్రవర్తించాడు. అతని దగ్గరికి వెళ్ళటానికిగాని, మాట్లాడటానికి గాని అందరికీ భయంగా వుంది.



ఎప్పుడూ కత్తి విడవకుండా తిరిగేవాడు.

ఇలా వుండగా ఒక రాత్రి ఒక అమ్మాయి అతని దగ్గరకు ఒక వుత్తరం పట్టుకు వచ్చింది. ఆ అమ్మాయిని చూస్తే కమలా కరం అన్నకి ఆశ్చర్యం కలిగింది. పెద్దవాళ్ళే బయటికి రావటానికి భయపడుతున్న రోజులు! ఈ పిల్ల ఎలా ధైర్యం చేసింది?

''ఎవరు నువ్వు?'' అడిగాడు.

''జిజియా చెల్లెలిని''

ఆ పేరు వినగానే కమలాకరం అన్న చెయ్యి కత్తి మీదకు వెళ్ళింది. కాని ఆ పిల్ల చలించకుండా అలాగే చూస్తూ నుంచుంది.

అతను ఉత్తరం విప్పి చదివాడు. జిజియా కమలాకరానికి వ్రాసిన ఉత్తరం అది.

''ప్రియ మిత్రమా!

ఏదీ మనం అనుకున్నట్లు జరగక పోవటం చాలా విచారకరం. నేను రాగానే మా వూళ్ళో హిందూ మహమ్మదీయ కల్లోలం ప్రారంభమయింది. శాంతింప జెయ్యటానికి నేననేక విధాల ప్రయత్నించాను.

ఇవాళ హిందువులు ఒక మహమ్మదీయ బాలుణ్ణి అకారణంగా హింసిస్తూ వుంటే చూడలేక అడ్డు వెళ్ళాను. ''ఇది తప్పు'' అని చెప్పాను. ''మత కలహం అనర్థదాయకం'' అన్నాను. వారు నా మాట వినలేదు. ''నీవు మహమ్మదీయ స్త్రీవి; అందుకని వారి పక్క మాట్లాడుతున్నావ''ని నిందించారు. వారికి కోపం పెరిగిపోయింది.

నన్ను బాకుతో పొడిచారు. పోటు డొక్కలో తగిలింది. నాకెవరి మీదా కోపం లేదు. కాని మనం అనుకున్న దేశసేవ చెయ్యటానికి వీలు లేక పోయిందే అని విచారం. ఐనా మీరు ఉన్నారు కదా, మనం కోరిన – ద్వేషాలు లేని , వర్గాలు లేని – మానవ సంఘం కోసం పాటు పడతారు కదా అనే నమ్మకంతో నిర్విచారంగా ప్రాణం విడుస్తున్నాను.

ఇట్లు,

జిజియా''

ఈ ఉత్తరం చదివేసరికి కమలాకరం అన్న చేతులు వొణికై. అతని కళ్లల్లో నీళ్ళు తిరిగినై...

కమలాకరం అన్న జిజియా చెల్లెలిని దగ్గరకు తీసుకున్నాడు ''చెల్లీ'' అన్నాడు.

*

*ప్రథమ ప్రచురణ – 1946 'సరే కానివ్వండి' కథా సంకలనంలో....*